క్లుప్తంగా

సౌత్ జోన్ పోటీలకు కృష్ణవేణి విద్యార్థులు



నరసరావుపేట ఈస్ట్: సౌత్ జోన్ అంతర్ విశ్వ విద్యాలయాల బాడ్మింటన్ పోటీలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు బుధవారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డాక్టర్ ఎల్.బి. ఇండోర్ స్టేడియంలో ఈనెల 21, 22 తేదీలలో నిర్వహించిన వర్సిటీ అంతర్ కళాశాలల బాడ్మింటన్ పోటీలలో తమ విద్యార్థులు డి.పృథ్వీసాయి మణికంఠ, బి.సూర్య కిరణ్‌లు ప్రతిభ కనబరిచి వర్సిటీ టీంకు ఎంపికైనట్టు వివరించారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు తమిళనాడులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల బాడ్మింటన్ పోటీలలో తమ విద్యార్థులు ఏఎన్ఎం టీంకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ప్రత్యేకావసరాలు కల్గిన వారు దైవసమానులు



శావల్యాపురం: ప్రత్యేక అవసరాలు కల్గిన వారందరూ దైవసమానులని ఐఈడీ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.సెల్వరాజ్ అన్నారు. బుధవారం స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన వసతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో ప్రత్యేక అవసరాలు కల్గిన చిన్నారులను తక్కువ చూపు చూడరాదన్నారు. శావల్యాపురం గ్రామవాసీ ముట్లూరి సుశీలమ్మ కుటుంబ సభ్యులు తమవంతు సహాయంగా నాలుగు కుర్చీలను వితరణ చేసి 50 మంది బాల బాలికలకు మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, ఎంఈవో పుసులూరి లలితకుమారి, ఐఈడీ సెంటరు ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, పి.పార్వతి, ఎంఆర్సీ సిబ్బంది లింగాల శ్రీహరి, మస్తాన్‌రావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం పువ్వాడ పంచాయతీలోని కొత్తకొత్తపాలతెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో బుధవారం ఐనవోలు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి సుమారు రూ.1,31,300ల నగదు, 3 ద్విచక్రవాహనాలు, 6 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బీవీ కృష్ణారావు తెలిపారు.

బైక్ మెకానిక్‌ని బలితీసుకున్న ప్రమాదం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో బైక్ మెకానిక్ మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. వినుకొండకు చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బుధవారం తన స్నేహితులైన శ్యామ్‌కుమార్, ఆంజనేయులతో కలిసి చీరాల బీచ్‌కు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పెట్లూరివారిపాలెం నుంచి కోటప్పకొండకు వెళ్లేదారిలో మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈప్రమాదంలో రోడ్డు పక్కకు పడిన శ్రీనివాసరావుకు తలకు రాయి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ కిషోర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రైలు కింద పడి ఆత్మహత్య

నరసరావుపేటటౌన్: రైలు క్రింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. క్రిష్టియన్ పాలెం వద్ద అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు క్రింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పడి ఉన్న ఆనవాళ్లను బట్టి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు నలుపు రంగు గళ్ల చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి వద్ద విజయవాడ నుంచి నరసరావుపేట రైల్వే టికెట్ లభ్యమైంది.

అన్యాయంగా ఉద్యోగాలు తొలగించారు

- రాజకీయాలతో కార్మికుల పొట్టకొట్టిన కూటమి నాయకులు
- గత 21 రోజుల నుంచి కార్మికులు ఆందోళన
- తొమ్మిది రోజులుగా రిలే దీక్షలు
- విధుల్లోకి తీసుకోవాలంటూ కార్మికుల డిమాండ్



మున్సిపల్ కార్యాలయం ఎదుట శిబిరంలో దీక్ష చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: వారందరూ వందేళ్లకుపైగా చరిత్ర కల్గిన జిల్లా కేంద్రంలోని పురపాలక సంఘంలో పనిచేసే చిరు ఉద్యోగులు.. చాలీచాలని జీతాలతో గత ఐదేళ్లుగా పనిచేస్తున్న వారు... కొందరు తమ భర్తలు ఉద్యోగం చేయలేకపోతే నియమించబడిన వారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీరిపై కన్ను పడింది. తాము 20 లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తామని చేసిన వాగ్దానం గుర్తుకు వచ్చింది. గత ప్రభుత్వం కాలం నుంచి పని చేస్తున్నారనే ఒకే ఒక్క కారణంతో 53 మంది కార్మికుల పొట్టకొట్టారు. నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగించారు. ఏనాడు గత పాలకులు ఈవిధంగా వ్యవహరించ లేదు.

అవసరమైన విభాగాలలో మరికొంత మందికి ఉపాధి కల్పించారు. ఇప్పటి కూటమి నాయకుల తీరే వేరుగా ఉంది. వీరి ఆదేశాలతో మీరు రేపటి నుంచి ఉద్యోగాల్లోకి రావొద్దంటూ గత ఆగస్టు మూడవ తేదీన అప్పటి కమిషనర్ చెప్పటంతో దిగ్భ్రాంత్రికి గురయ్యారు. వీరు పార్కులలో పనిచేసే వాచ్‌మెన్‌లు, కమిషనర్ అటెండర్లు, ఇంజినీరింగ్ విభాగంలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద పనిచేసే కార్మికులు ఉన్నారు. వీరిని తొలగించిన స్థానంలో వారి మనుషులు కొంతమంది వీరు చేస్తున్న విధుల్లోకి చేర్చుకున్నారు. దీంతో వీరి కుటుంబాలు గత మూడు నెలల నుంచి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. వీరి ఆవేదనకు ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు బాసటగా నిలబడ్డాయి. ఈనెల మూడవ తేదీ నుంచి మున్సిపల్ కార్యాలయం ఎదుట తమను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలనే డిమాండ్‌తో నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. అప్పటికీ హృదయంలేని పాలకులు స్పందించకపోవటంతో గత తొమ్మిదిరోజుల నుంచి రిలేదీక్షలు చేపట్టారు.

వీరికి ఉద్యోగాలలో ఉన్న మిగతా కార్మికులు మద్దతు పలికారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్ ముందు కూర్చొని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వీరిని తక్షణమే ఉద్యోగాల్లోకి తీసుకోకపోతే సమ్మెలోకి దిగటంతో పాటు తాగునీరు, విద్యుత్ వ్యవస్థలను స్తంభింపచేస్తామని కార్మిక సంఘ నాయకులు హెచ్చరించారు. మూడు నెలలుగా జీతాలు రాక.. కుటుంబాలు గడిచే మార్గం కానరాక వారు పడుతున్న బాధను ఓమారు ఆలకిస్తే ఎంత కఠినాత్ముడైనా కరిగిపోవాల్సిందే.

ఉద్యోగమే ఆధారం



మమ్మల్ని అన్యాయంగా తొలగించారు. తొలగించే ముందు మా కుటుంబాల పరిస్థితి చూడాలి. ఈ జీతంపైనే ఆధారపడి ఉన్నాం. నాకు భర్త, పిల్లలు ఉన్నారు. నియామకాలనేవి ఏ ప్రభుత్వంలోనైనా జరుగుతాయి. తమ వ్యతిరేక ప్రభుత్వంలో నియమించారనే ఉద్దేశ్యంతో తొలగించటం ఎంత వరకు న్యాయం. పాలకులు ఆలోచించాలి.

–ఎస్.రమాదేవి, పార్కు కార్మికురాలు

ఆర్థిక ఇబ్బందులతో అల్లాడుతున్నాం



నేను ఐదేళ్లుగా కమిషనర్ అటెండర్‌గా పనిచేస్తున్నా. నాకు రూ.15 వేలు జీతమైతే రూ.2 వేలు కట్ చేసుకొని రూ.13 వేలు చేతికి వస్తాయి. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడు నెలల నుంచి జీతం ఆగిపోయింది. ఆర్థిక ఇబ్బందులతో కటకటలాడుతున్నాం. అన్యాయంగా తీసేశారు. నాయకులు మనస్సు మార్చుకొని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి.

–షేక్.మహబూబు సుభాని, కమిషనర్ అటెండర్

కుటుంబాలకు న్యాయం చేయాలి

అర్థాంతరంగా తొలగించిన కార్మికులు అందరికీ న్యాయం చేయాలి. లేకపోతే మా కుటుంబాలు రోడ్డున పడతాయి. మా విధి నిర్వహణలో ఏనాడు అలసత్వం ప్రదర్శించ లేదు. నాకు భార్య, పిల్లలు ఉన్నారు. కూటమి నాయకులు పునరాలోచించాలి.

–షేక్ సైదా, వాటర్ ట్యాంకు కార్మికుడు

భర్త మంచంలో ఉన్నాడు



నా భర్త ఇదే పురపాలక సంఘంలో 16 ఏళ్లపాటు ఉద్యోగం చేస్తూ పక్షవాతానికి గురయ్యాడు. ఆయన పని చేయలేకపోతే నాకు రెండేళ్ల క్రితం ఉద్యోగం ఇచ్చారు. పార్కులో పనిచేస్తుంటా. నా భర్త మంచంపైనే ఉన్నాడు. నెలకు రూ.4 వేలు మందులకు ఖర్చు అవుతుంది. మూడు నెలల నుంచి జీతాలు లేవు. మేమెలా బ్రతకాలి. ఇదేమి న్యాయం.

–పి.రమణ, బరంపేట పార్కు కార్మికురాలు

పంటకు సస్యరక్షణ చేపట్టాలి



రొంపిచర్ల మండలంలో మిర్చి పంటను పరిశీలిస్తున్న అధికారులు



తూబాడులో పత్తిపంట పరిశీలిస్తున్న ఏవో హరిప్రసాద్



పోట్లూరులో పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- వరిలో తెగుళ్లు నివారించండి
- రైతులకు వ్యవసాయ సిబ్బంది సూచన
- వేర్వేరు గ్రామాల్లో పొలంబడి

శావల్యాపురం: వరి పైరులో అగ్గితెగులు ఆకుచుట్టు పురుగు తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దినేని శివకుమారి అన్నారు. మండలంలోని పోట్లూరు, ఇర్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు పంట పొలాలను సందర్శించి రైతు సేవ కేంద్రంలో రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఏ శివకుమారి మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతుల ద్వారా పంటలు సాగు చేయాలన్నారు. రైతులు సాగు చేస్తున్న పంటల్లో రసాయనిక ఎరువులు వినియోగం మోతాదు మించి వినియోగించరాదన్నారు. అధికంగా రసాయనిక ఎరువులు వినియోగం వలన భూమిలో ఉండే పోషకాలు శాతం తగ్గిపోవటంతో పాటు వాతావరణంలో కాలుష్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పురేటి అశోక, వీఏఏ శివనాయక్ పాల్గొన్నారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: తూబాడు, చిరుమామిళ్ల గ్రామాల్లో వ్యవసాయాధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో హరిప్రసాద్, గణపవరం పశువైద్యాధికారి సాంబశివారెడ్డి పాల్గొని ముందుగా పత్తి పొలాలను పరిశీలించారు. ఇటీవలి వర్షాలకు కొంతమేర పత్తి దెబ్బతినే అవకాశం ఉందన్నారు. రైతులు పత్తి పంటను పట్టెలుగా విడగొట్టుకున్నట్లయితే కొంతమేర నేల ఆరుతుందని, మొక్కలు కుళ్లే ప్రమాదం తప్పుతుందన్నారు. సమగ్ర సస్యరక్షణతో గులాబీ రంగు పురుగును నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవో జీవన్‌నాయక్, వీహెచ్ఏలు కృష్ణచైతన్య, సుబ్బారావు ఉన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నుంచి మిర్చి పైరును కాపాడుకునేందుకు రైతులు కనీస యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి అన్నారు. మండలంలోని అలవాల, అచ్చయ్యపాలెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. మిర్చి పంటకు యూరియా, పొటాష్, మల్టీకే వినియోగించాలన్నారు. వీటితో పాటు 19–19–19 హ్యూమిక్ యాసిడ్ పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న మిర్చి, వరి పైర్లను సందర్శించారు. పీఎం కిసాన్ స్కీంలో రైతులకు డ్రోన్‌లు, వరినాటే యంత్రాలు సబ్సిడీపై అందజేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పి. మస్తానమ్మ, ఏవో శివలలిత, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

యూడైస్ ప్లస్‌లో తప్పులు లేకుండా చూడండి

బొల్లాపల్లి: పాఠశాలల విద్యాశాఖ కమిషనర్‌తో వెబెక్స్ సమావేశం బుధవారం ఏపీ మోడల్ స్కూల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాఠశాలలకు కేటాయించిన నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థుల హాజరు పట్టిక సక్రమంగా ఉండాలన్నారు. నెలకు ఒకసారి తల్లిదండ్రుల సమావేశం తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. యూడైస్ ప్లస్‌లో పొందుపరిచిన విద్యార్థుల వివరాలను తప్పులు లేకుండా చూసుకోవాలని ఈ సమావేశంలో పలు అంశాలను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించినట్లు ఈ మేరకు ఎంఈవో –2 కె.పార్వతి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతాం

జిల్లా కలెక్టర్, ఎన్‌టీఆర్ సమన్వయకర్తలకు వైద్యమిత్రల వెల్లడి



ఎన్‌టీఆర్ సమన్వయకర్త చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: గత కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 29వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు పల్నాడు జిల్లా వైద్యమిత్ర అసోసియేషన్ నాయకులు చెప్పారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎన్‌టీఆర్ వైద్యసేవ సమన్వయకర్త జి.చంద్రశేఖర్‌ను కలిసి సమ్మె వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా వైద్యమిత్రలుగా పనిచేస్తున్నప్పటికీ ఇప్పటికీ కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఒక క్యాడర్ అంటూ లేదని, ప్రస్తుతం మాకు ఇస్తున్న జీతం రూ. 15 వేలు మాత్రమేనన్నారు. తమకు ఎటువంటి సంక్షేమ పథకాలు కూడా లభించడం లేదని, ఎన్నిసార్లు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసినా తమ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెలోకి వెళ్తున్నట్లు చెప్పారు. మా 17 ఏళ్ల కాలాన్ని పరిగణలోకి తీసుకొని వైద్యమిత్రాలను కాంట్రాక్టు విధానంలోకి మార్చి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు సాయిబాబురాజు, ఆంధ్రప్రదేశ్ దళిత గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.అప్పారావు, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, జిల్లా సెక్రెటరీ శివ నాగేశ్వరరావు, సహ కార్యదర్శి సింగంశెట్టి వెంకటేశ్వర్లు, ట్రెజరీ అశోక్ పాల్గొన్నారు.

విలువైన గ్రీన్ బోర్డులు బహూకరణ

నాదెండ్ల: యడ్లపాడు మండలం జాలాది గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (హెచ్ఈ)కు అదే గ్రామానికి చెందిన జరుగుల సుధారాణి రూ.12 వేల విలువైన రెండు గ్రీన్ బోర్డులను బహూకరించారు. ఎంఈవో–1 నాగరత్నం, హెచ్ఎం నూతక్కి మునియ్యలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగరత్నం మాట్లాడుతూ, విద్యాభివృద్ధి పట్ల గ్రామస్తులకు ఉన్న సామాజిక స్పృహ అభినందనీయమని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె కీర్తి, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ ఉన్నారు.

బ్లడ్ సెంటర్‌లో సర్వమత ప్రార్థనలు



నరసరావుపేట: స్థానిక 200పడకల ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ప్రారంభం కాబోతున్న రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రెడ్‌క్రాస్ చైర్మన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు బుధవారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చేనెల 10వ తేదీన బ్లడ్ బ్యాంక్ సెంటర్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ప్రజాప్రతినిధులు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు.వైస్ చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి గంద్రకోట మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ డాక్టర్ సృజన, డాక్టర్ రహమతుల్లా, సభ్యులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, జెల్లీ వీరారెడ్డి, జీవీఎస్ రాము, యస్.కె. జిలానీమాలిక్, బ్లడ్ సెంటర్ వైద్య అధికారులు డాక్టర్ మురళీధర్, డాక్టర్ రంగారావు, ఆర్ఎంవో ఏడుకొండలు పాల్గొన్నారు.

పరిశీలిస్తాం.. పరిష్కరిస్తాం...!

భూ సమస్యల అర్జీలపై అధికారులు



సంకురాత్రిపాడు గ్రామ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఏవీ రమణ

నాదెండ్ల: సంకురాత్రిపాడు గ్రామ సచివాలయం వద్ద బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ రమణ, డీటీ ధనలక్ష్మీ, సర్వేయర్ రాంబాబు పాల్గొన్నారు. రీసర్వే జరిగాక భూమి కొలతల్లో తేడాలున్నాయంటూ 41 మంది భూ యజమానులు అర్జీలు అందించారు. అర్జీలను సమగ్రంగా పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జెట్టి నాగమణి, వీఆర్వో నాగలక్ష్మి, విలేజ్ సర్వేయర్ కళ్యాణ్, నాయకులు ఉన్నారు.

యడ్లపాడులో..

తిమ్మాపురం గ్రామంలో బుధవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ విజయశ్రీ, డీటీ అనురాధ, సర్వేయర్ సురేంద్రనాథ్ హాజరయ్యారు. 45 మంది భూ యజమానుల నుంచి అర్జీలు స్వీకరించారు. త్వరలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలి

బాలల హక్కుల పరిరక్షణ నిర్వహణ కమిటీ సభ్యురాలు పద్మావతి



బత్తుల పద్మావతికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

చిలకలూరిపేట: ఉపాధ్యాయులు విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించి సత్వర పరిష్కారం చూపాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ నిర్వహణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి చెప్పారు. మండలంలోని పోతవరం గ్రామంలో ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్న విషయం తెలుసుకొని డీఎంఅండ్‌హెచ్‌వోకు ఫోన్ చేసి ప్రతి నెలా విద్యాలయంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వంట చేసే సిబ్బంది పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని శారదా జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

విద్యార్థులు ఆమెతో మాట్లాడుతూ క్రమశిక్షణా చర్యల పేరున టీసీలు ఇచ్చి పంపుతున్నారని ఫిర్యాదు చేశారు. డ్రాప్ అవుట్‌లో పేరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆమె ఉపాధ్యాయుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు టీసీ ఇచ్చి పంపటం అంటే వారి హక్కులను హరించి వేయడమేనని హెచ్చరించారు. ఇదే విషయాన్ని ఫోన్ ద్వారా డీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంట సీడీపీవో శాంతకుమారి ఉన్నారు.

ప్రాంగణ ఎంపికలో 42 మందికి ఉద్యోగాలు



విద్యార్థులతో కళాశాల చైర్మన్ శేషగిరిరావు, డైరక్టర్ శ్రావ్య

నరసరావుపేట రూరల్: బెంగుళూరుకు చెందిన అకాడెమోర్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 42 మంది విద్యార్థినులు ఉద్యోగాలు సాధించినట్టు ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు బుధవారం తెలిపారు. ప్రాంగణ ఎంపికలో భాగంగా విద్యార్థినులకు వ్రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు మొదటి ఆరు నెలలు శిక్షణ ఇస్తారని, శిక్షణ కాలంలో నెలకు రూ.25 వేలు పరిమిత వేతనం చెల్లిస్తారని తెలిపారు. అనంతరం వార్షిక వేతనం రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు అందిస్తారని వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపల్ డాక్టర్ సాదినేని రామారావు, ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ జె.రవిశంకర్, విభాగాధిపతులు రాధికా, సితార, నవీన్, అధ్యాపకులు అభినందించారు.

నేడు సొలసలో ఉచిత వైద్యశిబిరం

నాదెండ్ల: యడ్లపాడు మండలం సొలస గ్రామంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కె ప్రవీణ్ తెలిపారు. విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని గ్రామంలోని శ్రీభూసమేత రంగనాయకస్వామి ఆలయం ఎదురుగా ఉన్న మండపంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుంటూరుకు చెందిన శ్రేష్ఠ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్య బృందం పాల్గొని గుండెకు సంబంధించి ఉచిత పరీక్షలు నిర్వహించి వైద్యం అందించనున్నట్లు తెలిపారు.

గుంటూరుకు చెందిన మ్యాక్సీ విజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్‌కార్డు జిరాక్సు తీసుకురావాలని కోరారు.



సత్తెనపల్లి రోడ్డు బస్టాండ్ సెంటర్‌లో మహాత్ముని విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డులు

మహాత్మా.. మన్నించు

పట్టణంలోని పలువురు స్వాతంత్ర్య సమరయోధులకు కూటమి నాయకులు అవమానిస్తున్నారు. సత్తెనపల్లి రోడ్డు బస్టాండ్ సెంటర్‌లోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం చుట్టూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆయన సతీమణికి దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలియచేస్తూ వారి అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. దీంతో విగ్రహం రెండింతులు మూసుకుపోయి కేవలం సగం భాగం మాత్రమే కనిపిస్తోంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును వివరణ కోరగా రెండురోజుల క్రితం తన దృష్టికి కూడా వచ్చిందని, వాటిని తొలగించాలని సిబ్బందికి సూచించినట్లు చెప్పారు. –నరసరావుపేట

కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

నాదెండ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అనిల్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గుంటూరు నుంచి ద్విచక్రవాహనంపై బుధవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా కాటూరి ఆసుపత్రి వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. గాయాలపాలైన అనిల్‌ను గుంటూరులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు.